

# ప్రేమబోధిని

మా అత్తమామలు వరుసగా మా తల్లిదండ్రులను ప్రేమించిన సంద
ర్భంలో నా పెళ్ళి స్థిరపడింది. ఆలోచించుకోడానికేనా వ్యవధి
కుండా ముహూర్తం పెట్టేరు. చూస్తుండగా పెళ్లయిపోయింది.
పిరాడకుండా కాపరం పెట్టించేరు. గుక్క తిప్పుకోకుండా పిల్లలు
ట్టేరు. ఇంక ప్రేమించడాని కవకాశ మేదీ! ఈ "ప్రేమ" అనేది
ర్వజన్మ సుకృతంవల్ల లభ్యమయ్యే ఒక మహాయోగమని నా
మ్మకం. అసురులకు అమృతం లాగ నాకు ఈ ప్రేమొక తీరని
కైపోయింది. పోతే, అనుభవరీత్యా నే గ్రహించిం దేమిటంటే...

పెళ్ళి అనేది మొగాడనే బ్రహ్మ పదార్థాన్ని ఆడదనే జడ పదార్థంతో (రిబ్బన్‌తో సహా) సమ్మేళనంచేసే వేదోక్తమైన దురాచారం... అని.

పోనీ సాహసించి ఏదో అవకాశం చూసుకుని ఈ ప్రేమ సాగరంలో ఓ మునుగు మునిగి చూద్దామనుకుంటే, మా ఆవిడ ధర్మమా అని అది అసాధ్యమైపోయింది. అసలు సంగతేమిటంటే, చిన్నప్పట్నుంచీ మా ఆవిడ నోరు ఓ 'లౌడ్‌స్పీకర్' లాగ ఉంటూ వొచ్చిందిట. మరి జ్ఞాన మొచ్చేక (ఒచ్చిందని ఆవిడ నమ్మకం) వాల్యూం ఇంకొంచెం ఎక్కువయిందిట. పెళ్ళయ్యేక విపరీత మయిం దనుకుంటుంటే, పిల్లలు పుట్టేక మితిమీరి పోయింది. ఇలాంటి మృదు మధుర సాధనంతో, నేను పరస్త్రీని కన్నెత్తి చూడననీ, చూసినా పలకరించడమైనా రాదనీ తలొంచుకుని మౌనంగా వుంటాననీ, మా ఆవిణ్ణి అదేపనిగా ప్రేమించేస్తాననీ, ఇల్లే నాకు స్వర్గ మనీ, పిల్లలంటే నాకు పంచప్రాణాలనీ వూళ్లో వాళ్ళ చెవులు చిల్లులు పడేలాగ మా ఆవిడ ప్రచారం చేస్తుంది. ఇలాంటి పరిస్థితుల్లో పోనీ అని తెగించి ప్రేమిద్దామనుకుంటే మాత్రం ఏ అడది ముందుకొస్తుంది. దానా దీనా ప్రేమంటే కేవలం ప్రబంధ సాహిత్యంగానూ వెండి తెరమీద దృశ్యాలుగానూ నా మనస్సులో ఉండి పోయింది.

* * *

చంద్రం ఆరు నెలల్నుంచి శారదని ఏకధాటిగా ప్రేమించేస్తున్న సందర్భంలో తన ప్రేమ సిద్ధాంతాల్ని విశ్వవ్యాప్తి చేసి మానవ లోకంలో నైతికవిప్లవం తీసుకురావాలని బద్ధకంకణం ధరించడానికి ప్రబల నిదర్శనంగా "ప్రేమబోధిని" అనే గ్రంథాన్ని రాశాడు. ఈ నాడు యుద్ధప్రేరేపణ, పరరాజ్యాపహరణ, రాజకీయ వైషమ్యాలు, పదవీవ్యామోహం, ధనాపేక్ష, జాతి-కుల-మత భేదాలు సమసిపోవాలంటే వీటిపై ప్రవహించే మానవుల మనస్సులను ప్రేమమీదికి మళ్ళించాలి. అప్పుడే మానవలోకమంతా ప్రేమమయమై విశ్వశాంతి కరతలా

మలకపోతుంది. ప్రజాసామాన్యానికి ప్రేమ సిద్ధాంతాలు సులభ గ్రాహ్య మయ్యేలాగ డాక్యుమెంటరీ చిత్రాలు తియ్యాలి. నేటి శారదాబిల్లు, వరకట్న నిషేధచట్టం రద్దుచేసి వాటి స్థానే నిర్బంధ ప్రేమ వివాహచట్టం అమలుజరపాలి. దీని ముసాయిదాకూడా 'ప్రేమ బోధిని'లో ఒక అధ్యాయంగా పొందుబరచబడి వుంది. ఇలాంటి మహత్తర విషయా లెన్నో ఆ పుస్తకంలో వున్నాయి. ప్రేమబోధిని చదివే అదృష్టం కలిగిన విద్యాశాఖామంత్రి యీ పుస్తకాన్ని ప్రీ-యూనివర్సిటీ తరగతిలో పాఠ్యగ్రంథంగా వుంచాలని అభిప్రాయం వెలిబుచ్చినట్టు ఒక అనధికార వార్త.

చంద్రం ధర్మమా అని ప్రేమబోధిని చదివే భాగ్యం నాకూ కలిగింది. పరస్త్రీని ప్రేమించే అవకాశం, సాహసం లేనందువల్ల కనీసం భార్యనైనా ప్రేమించి తరించాలన్న సత్సంకల్పంతో, దీనికికూడా సహకారంకావాలి కాబట్టి, ఆ పుస్తకాన్ని చదువమని మా ఆవిడ కిచ్చేను. మోక్షతుల్యమైన ఈ ప్రేమోపాసన మా ఆవిడ ఎంతవరకూ సాధన చేసిందో చూద్దామని, ఇంచుమించు మంచు ముక్కలాగ సంచలనం లేకుండా మంచంమీద శయనించిన ఆమెను మృదువుగా తట్టిలేపి "చదివేవా?" అని అడిగేను. కాలసర్పం పడగ ఎత్తినట్టు అమాంతంగా మంచంమీద లేచి కూర్చుని "ఆ దిక్కుమాలిన ప్రేమ బోధి నేనా! ఏడిసినట్టుంది. దానితో అంటిస్తే కుంపటి కూడా అపవిత్రమై పోతుందని పెంటమీదకి గిరవాటెట్టేను" అంది బుసకొడుతూ.

"అది చంద్రం రాశాడే... విద్యాశాఖా మంత్రి కూడా..."

"ఏడవలేక పోయాడు. ఎప్పటికప్పుడే చెబుదా మనుకుంటున్నాను. ఈసారి ఆ చంద్రంగారు మన గడప తొక్కేడా గరిటె కాల్చి వాతెడతానని చెప్పమంది పక్కింటి పేరమ్మగారు."

"ఆవిడ కదేం రోగం!"

"రోగం కాదు. చంద్రంగారి ప్రేమ రోగానికి మందు."

నాకీ ధోరణి అర్థం కాలేదు. ప్రేమ బోధినిలో వితంతు ప్రేమ వివాహాలు విలువయినవనీ, విధిగా విరివిగా వైభవంగా జరగాలని వున్నమాట వాస్తవమే. అయితే పేరమ్మగారు ఏభయ్యేళ్ళు దాటిన వితంతువు కేశవిహీనురాలు. నిత్యధవళ వస్త్రధారిణి. ఇంతటి ఘోరమైన విధవలకూడా ప్రేమార్హులని చదివినట్టు జ్ఞాపకం లేదు. మరోసారి ప్రేమబోధిని చదివితే వెగాని ఈ విషయం ఇదమిత్థమని తేల్చడం కష్టం. అయినా ముందు సందేహనివృత్తి చేసుకుందామని మా ఆవిణ్ణి అడిగేను.

"చంద్రం పేరమ్మగార్ని ప్రేమించేడా!"

"అలా చేస్తే ఆయనరోగం అంత ముదరకుండానే ఆవిడ చీపురు కట్టతోటో పేడనీళ్ళతోటో వైద్యం చేసుందేది."

"మరిం కెందుకు వాత లెట్టడం?"

"ఆయన శారదని ప్రేమిస్తున్నాట్ట ఆవిడ కది యిష్టంలేదు."

"ఆవి డిష్ట మేమిటి! బోడి యిష్టం! ఆవిడ కిష్టం లేకపోతే వూళ్లో వాళ్లెవళ్ళూ ప్రేమించుకోకూడదా!"

"ఎందు క్కూడదూ! కావలిస్తే ఆయన వూళ్లో వాళ్ళందరినీ తీరుబడిగా ప్రేమించుకోమనండి... ఆ అమ్మాయిని తప్ప"

"వాళ్ళిద్దరూ ఇష్టపడి ప్రేమించుకుంటుంటే..."

"ఎంత అప్రతిష్ట! నెమ్మదిగా మాట్లాడండి. ఈ మాట ఆవిడచెవిని పడిందంటే ముందు మీకు మర్యాద చెయ్యకలదు. అయినా ఆ చంద్రంగారి కదేం పొయ్యేకాలమండీ! ఆ అమ్మాయిమీద ప్రేమగీతాలు రాసి పత్రికల్లో వేయించడమూ, ఆ పత్రికలన్నీ ఆ అమ్మాయికి పంపిస్తూ దస్తా కాగితాలకి తక్కువ కాకుండా ప్రేమలేఖలు రాస్తాట్ట!

"ప్రేమంటే అదేనే! నువ్వు నాలుగో అధ్యాయంలో ప్రేమ లేఖల నమూనాలు చదవలేదూ!"

"మీ కేమయినా మతి పోయిందా! పెళ్ళికాని పిల్లకి మర్యాదస్తు డెవడైనా వుత్తరాలు రాస్తాడా!"

"పెళ్ళయిన పిల్లకి రాయమంటావా! ప్రేమించేడు కనకనే శారదకి వుత్తరాలు రాశాడు. రేపొద్దున ఆ అమ్మాయిని పెళ్ళాడ్డానికి కూడా సిద్ధంగా వున్నాడు."

"ఔవ్వ! ఔవ్వ! శారదకి పెళ్ళి స్థిరపడితే, ఆయన పెళ్ళాడట మేమిటండీ!"

"ఎవరా పెళ్ళికొడుకు?"

"పేరమ్మగారి తమ్ముడు. మూర్తిగారు."

"ఏమిటీ! రెండో పెళ్ళివాడా!"

"అయితే మాత్రం ఏమిటండీ. ఆయనకి ముప్పయి రెండేళ్ళేగా వున్నాయి. ఏడాదయి భార్యపోయింది. మూడేళ్ళ చంటికుర్రాణ్ణెట్టుకుని, పెళ్ళీ పెడాకులూ లేకుండా ఎన్నాళ్ళుంటాడు!"

"శారద ఒప్పుగుందా!"

"ఎందు కొప్పుగోదూ. నిక్షేపంలా ఒప్పుకుంది. వాళ్ళ వాళ్ళా బీదవాళ్ళు, ఇదా కట్నం కానుకలూ లేని సంబంధం. అరమరిక లేని సంబంధం. మూర్తిగారి భార్యకీ తనకూ వున్న స్నేహ మయితే నేం, వాళ్ళ కుర్రాడంటే వున్న అభిమాన మయితే నేం, మూర్తిగా రంటే వున్న భక్తి గౌరవాలయితే నేం, పేరమ్మగారు పెళ్ళిమా టెత్తగానే తక్షణం ఒప్పుకుంది. ఆ అమ్మాయే తనంతకి తను 'నాకూ మూర్తిగారికీ అభ్యంతరం లేకపోతే ఈ సంసారాన్ని నేను చక్కదిద్దుకుంటాను' అనగానే, పేరమ్మగారూ నేనూ కూడా నిర్ఘాంతపోయాం. మూర్తిగారు శారదను పిలిచి వెర్రికెర్రి ఆవేశాల్లో పడి బతుకు

నాశనం చేసుకోవద్దని మందలించేడుట. తను చాలా ఆలోచించే ఈ నిర్ణయాని కొచ్చేనని చెప్పి ఆయన్ని ఒప్పించిందిట."

"అయితే పెళ్ళి స్థిరపడినట్లేనా?"

"వచ్చే శనివారం కాక ఆ పై శనివారం రాత్రి నరసింహ స్వామి ఆలయంలో పెళ్ళి. శుభలేఖ కూడా యివ్వాళే యిచ్చేరు."

"నీకు సంతోషంగా వుందా?"

"ఏమిటో మొదట్నుంచీ శుభలేఖ చూసి సంతోషించాలనే సంప్రదాయానికి చెందినదాన్ని; పదేళ్ళబట్టి మీతో కాపరం చేస్తున్నా, శుభలేఖ చూసి కంట తడిపెట్టడం అలవాటవ్వలేదు."

"అదికాదే... మూర్తిగారేమంత అందంగా వుంటాడు చెప్పు."

"మొగాడి కల్లా ముఖ్యం అందంటండీ! ... ... మొగుడికి కాస్త అందం తక్కువయితే వచ్చిన నష్ట మేమిటి! ... మన కాపరాని కేం లోటొచ్చింది!"

"నోర్మూయ్."

ఇంకా ఎన్ని సినీమాలు చూస్తే యీ సంఘానికి బుద్ధొస్తుందో కాని, నిత్య జీవితంలో మాత్రం ఎక్కడ చూసినా విలన్‌లాంటి మొగాళ్ళు హీరోయిన్‌లాంటి చక్కని చుక్కల్ని ఎగరేసుకుపోయి పెళ్ళాడటం కనబడుతుంది కాని హీరోల్లాంటివాళ్ళ కెక్కడా ఛాన్సు కనబడదు. నిజంగా ఇదే సినిమాలో అయితే చంద్రానికి శారదకి ప్రేక్షకులందరూ ఆశీర్వదిస్తూండగా కన్నుల పండువుగా పెళ్ళయ్యేది.

* * *

రాత్రల్లా శారదని గురించి ఆలోచించానేమో, పొద్దున్నే లేవగానే అరిచేతిలో శ్రీకారం చుట్టుకోబోయి పరధ్యాన్నంగా క్రాకారం

చుట్టుకున్నాను. ఈ అనర్ధక్షర రాక్షస మేమిటా అని శంకిస్తూనే లేచాను. తగ్గట్టుగానే కాఫీ గొంతుకు దిగకుండా మా ఆవిడొచ్చి "మీ కోసం యమభటు లొచ్చేరు" అంది. ఎవరా అని బయిటకొచ్చి చూస్తే విశ్వం, పద్మనాభం.

వీళ్ళిద్దరూ చంద్రం ప్రేమ రథానికి చెరో చక్రంలాంటి వాళ్ళు. ప్రేమంటే చెవి కోసుకుంటారు. అవకాశం లేక అడుగున పడిపోయిన ప్రేమోపాసకులు. వీళ్ళు ముగ్గురూ ఒకే గదిలో వుంటూ నాలుగేళ్ళ నుంచీ పట్టుదలగా బి. ఏ. చదువుతున్నారు. తీరుబడైనప్పుడల్లా పత్రిక ల్లోంచి నూతన దంపతుల ఫొటోలు సేకరించి భార్యల బొమ్మలూ, భర్తల బొమ్మలూ విడివిడిగా కత్తిరించి అందచందాల ననుసరించి నూతన జంటలను సమకూర్చి సమాజంమీద పగ సాధించే యోధులు.

"త్వరగా బట్ట లేసుకో" అన్నాడు విశ్వం.

"ఎక్కడికి ?" అడిగేను.

"యమలోకం."

"ఇంత పొద్దున్నే క్లబ్బు కెందుకురా !"

"ఎనిమిది గంటలకి రహస్యంగా సానుభూతి తీర్మానం; ఎనిమిది న్నరకి బహిరంగంగా అల్పాహారవిందు."

"ఏమిటి విశేషం ?"

"నిన్న చంద్రం ఆత్మహత్య చేసుకున్నాడు కదా."

"ఆఁ ! చంద్రం చచ్చిపోయాడా !"

"చస్తే అశ్రుతర్పణంచేసి వూరుకుందుం. బతికున్నాడు కనకనే యీ సమావేశం."

"మరి యీ ఆత్మహత్య గొడవేమిటి ?"

"చంద్రం తన ఆత్మని హత్యచేసుకుని, నిన్నట్నుంచీ కేవలం భౌతిక శరీరంతో జీవిస్తున్నాడు."

"అసలేం జరిగిందిరా ?"

"తన పెళ్ళిశుభలేఖ పంపుతూ శారద చంద్రానికి ఉత్తరం రాసింది... ... ..."

"ఏం రాసింది ?"

పద్మనాభం జేబులోంచి వుత్తరం తీసి "అతి రహస్యం" అని హెచ్చరించి చదవడం మొదలెట్టాడు.

శ్రీ చంద్రశేఖర్రావుగార్కి,

గత ఆరు నెలల్లోనూ విసుగూ-విరామం లేకుండా నాకు పంపుతూ వచ్చిన ప్రబంధాలులాంటి వుత్తరాలూ, మీ భావ (విరహ) గీతాలు ప్రచురితమైన పత్రికలూ, ఈ మధ్యనే పంపిన ప్రేమబోధిని చదివి అపరిమిత వినోదభరితురాల్నయ్యేను.

నన్ను మీరు విపరీతంగా ప్రేమించేస్తున్నట్టూ, పెళ్ళాడేసెయ్యటానికికూడా సిద్ధంగా వున్నట్టూ గ్రహించి మీ త్యాగశీలతకు మనస్సులోనే జోహార్లర్పించుకున్నాను. ప్రణయసరోవరంలో కవితానౌకనెక్కి విరహాగీతాలు గానంచేస్తూ స్వైరవిహారం చేసే మిమ్మల్ని ప్రేమించటానికి కావల్సిన అనుభవం, ధైర్యసాహసాలూ నాకు లేవు. అదీకాక, నేనుకూడా ప్రయత్నించి మిమ్మల్ని ప్రేమిస్తే ఆ ప్రేమ ఫలించి యీనాడు మీరు చేస్తున్న అపార ప్రేమసాహిత్యకృషికి అంతరాయం కలుగుతుంది. అలాంటి సాహిత్య హత్య నేను చెయ్యలేను.

నా కాబోయే భర్త మీఅంతటి ప్రేమపండితులు కాకపోయినా గౌరవ-మర్యాదలూ, ఆత్మాభిమానం వున్న విద్యావంతులు. మా వివా

పోని కొచ్చి నన్నాశీర్వదించమని కోరుతూ, ఇందుతో శుభలేఖ పంపుతున్నాను.

"శారద."

"ఇది చదివి ఏమంటాడు చంద్రం?" పద్మనాభా న్నడిగేను.

"ఏమి టనేది? నేను వద్దంటున్నా వినకుండా, తిన్నగా మేడ మీద పైడాబా గోడెక్కి కిందకి దూకేసి ఆత్మహత్య చేసుకోబోయి కళ్ళు తిరిగి డాబామీద పడ్డాడు. కాలు బెణికింది. వాడి పరిస్థితి చూసి వాడి మేనమామకి "ట్రంక్ కాల్" చేశాను. టెలిగ్రాంలాగ వూడి పడ్డాడు."

"మరి యివ్వాళ పొద్దున్న యీ పార్టీ ఏమిటి?"

"వాడి మేనమామ యిస్తున్నాడు."

"ఎందుకురా!"

"చంద్రానికి మేనరికం వుందని ఎప్పుడూ చెప్పలేదే?"

"ఈ శారద ప్రేమలోపడి యీ జన్మలో మేనరికం చేసుకోనని శపథం బట్టేట్టు."

"మ రిప్పు డెలా చేసుకుంటాడు?"

"నిన్నటి గండంతో వాడిది పునర్జన్మకనక ఆ పట్టింపు లేదని వాళ్ళ మేనమామే నచ్చచెప్పేడుట."

"ఆ అమ్మాయికి వీడంటే యిష్టమేనా?"

" 'అత్తా' 'అమ్మా' అన్నమాటలు రానిక్రితమే 'బావా బావా' అనడంతో మాటలు నేర్చుకుందిట. చిన్నప్పట్నుంచీ వీణ్ణే పెళ్ళాడతా

నని ప్రతిజ్ఞ చేసిందిట. పైగా వీడు రాసిన ప్రేమబోధిని చదివినప్పట్నుంచీ వీణ్ణి తప్ప యింకెవర్నీ పెళ్ళాడనని ఇంట్లో ఘోర తపస్సు చేస్తోందిట."

"మరి చంద్రానికదేం పొయ్యేకాలంరా!"

"అసలు ఆ అమ్మాయి తపోబలం వల్లనే శారదకి పెళ్ళి నిశ్చయమై పోవడం, వీడికి పునర్జన్మ ప్రాప్తి జరిగేయని వాడి మేనమామ వాదం. ఆ అమ్మాయిని పెళ్ళాడకపోతే యిలాంటి గండ పరంపరలు తప్పవని బెదిరించేడుట."

"మరి చంద్రం ఏమన్నాడూ."

"ఆ... ఏమంటాడు! వాడి అత్త నిన్ననే చచ్చిపోయింది. కనక పెళ్ళాడి ప్రాణం ఈ అమ్మాయి కప్పజెప్పి తను నిర్జీవ భౌతిక శరీరంతో బతుకుతాట్ట."

"వాళ్ళ మేనమామ ఇది విని ఊరుకున్నాడా?"

"ఆమాత్రం దారిలోకొస్తే చాలు. మిగతా విషయాలన్నీ వాళ్ళమ్మాయి పాతివ్రత్యంతో అవే సద్దుకుంటాయి పొమ్మన్నాట్ట."

"దీనికేం గాని మరో ముఖ్యమైన పనిమీద నీదగ్గరకొచ్చాం నువ్వో ఉపకారం చెయ్యాలి. దానికి నువ్వే సమర్థుడివి" అంటూ రంగంలోకి దిగేడు విశ్వం.

"ఏమిట్రోయ్" అంటూ అభయహస్త మిచ్చేను.

"ప్రేమబోధిని అచ్చు వేయించటానికి మే మిద్దరం చెరో ఐదు వందలూ పెట్టుబడి పెట్టేం. అవి దీపావళిలో టపాకాయల్లాగ ఇట్టే అమ్ముడయిపోతే అట్టే మా డబ్బు లాభంతోసహా యిచ్చేస్తానన్నాడు చంద్రం. ప్రస్తుతం వాటి అమ్మకం పరిస్థితి చూస్తే భారత దేశాన్నుంచి రష్యాకి ఎగుమతయిన చెప్పుల జతల్లాగ తిరిగి వచ్చేస్తున్నాయి."

"అదేం !"

"సిటీ బుక్ హౌవుస్ వాడి కిచ్చిన వెయ్యి కాపీలకీ, ఈ నెల్లాళ్ళ లోనూ రెండు కాపీలు బ్రహ్మాండం మీద అమ్మేడట. కొన్న ఆ యిద్దరూ కూడా మర్నాడే తిరిగొచ్చి వొంటిమీద దెబ్బలూ, వాతలూ చూపెట్టి కాళ్ళా వేళ్ళాపడి సగం రేటుకి తిరిగి అమ్మేసి పోయారుట" అంటూ కంట తడిపెట్టేడు విశ్వం. వాడి మాటలు వింటుంటే మా ఆవిడ ఎంతటి మహా పతివ్రతో అర్థ మయ్యింది.

"సరే నన్నేం చెయ్యమంటారో చెప్పండి" అన్నాను ధీమాగా.

"ఏమీ అక్కర్లేదు. ఉత్త మాట సహాయం. చంద్రం మేన మామ కాసీకట్నం యివ్వడుట. తన కొడుకుల పెళ్ళిళ్ళకి కట్నం పుచ్చుకున్న మహా పాపానికి పశ్చాత్తాపపడి కూతురు పెళ్ళికైనా నీతికి కట్టుబడి వుండాలని కట్నాన్ని నిషేధించాడుట. కాని బాగా డబ్బున్న వాడుట. ఇవ్వాళ మంచి హుషారుగా యీ పార్టీ యిస్తున్నాడు. అంచేత పార్టీ అయిన తర్వాత ఆయన మూడ్ కనిపెట్టి, ఈ పెట్టుబడి డబ్బులు రాబట్టే ఏర్పాటుచెయ్యి. కావలిస్తే సకలహక్కు భుక్తాలతోటీ జన్మ జన్మాలకి కావల్సిన కాపీరైట్ తోసహా ప్రేమబోధిని కాపీ లన్నీ ఆయన కిచ్చేస్తామని చెప్పు."

"అసలు మని షెలాంటివాడు ?"

"నవనీతంలాంటి మని షనుకో"

*　　*　　*

సినీమాలో ఆఖరి రీల్ లో మజ్నూలాగ వెర్రిమొహం వేసుకుని దెయ్యం రూపంలో ప్రత్యక్షమయిన చంద్రం జీవచ్ఛవం తాలూకు భుజంమీద చెయ్యివేసి "కంగ్రాచ్యులేషన్స్" అన్నాను. క్షణం బాహ్య ప్రపంచంలోకి అడుగెట్టి "థాంక్స్" అని వాడి మేనమామ అటురావడం

చూసి మళ్ళీ జీవసమాధిలోకి పోయాడు. విశ్వం పద్మనాభం నన్ను కోరస్‌లో స్తుతిస్తూ ఆయనకి పరిచయుం చేసేరు. వాళ్ళవూళ్ళో ఆయన హెడ్‌మాస్టరుట. ఆకారం చూస్తే రావణాసురుడు, కంసుడు, దుర్యోధనుడు, శిశుపాలుడు మొదలయిన పురాణపురుషులు జ్ఞాపక మొస్తున్నారు.

అందరూ ఎవరి వినోదాల్లో వాళ్ళు వున్నారు. చంద్రం అక్కడ లేడు. అదే సమయమనుకుని వాడి మేనమామతో కబుర్లు చెప్పడాని కుపక్రమించేను. బయటినుంచి విశ్వం పద్మనాభం చెవులు రిక్క పొడుచుకుని కిటికీ వెనకాల పొంచి వింటున్నట్టు వాళ్ళ నీడలు కనబడుతున్నాయి.

'ప్రేమబోధిని చంద్రం చాలా కష్టపడి రాశాడు' అన్నాను.

'అవునుట !'

'విశ్వం పద్మనాభం ఆ పుస్తకం అచ్చు వేయించడానికి చాలా శ్రమ పడ్డారు.'

'విన్నాను.'

'మీరా పుస్తకం చదివేరా ?'

'లేదు. మా అమ్మాయి చదివింది. దానితోటే నాకూ మా అమ్మాయికీ జ్ఞానోదయం అయ్యింది.'

'ఆవిడకు కూడా ఈ ప్రేమసిద్ధాంతంలో నమ్మక ముందన్న మాట.'

'చూడండి, వశిష్టమహర్షి 'నారాయణ, నమశ్శివాయ' అనే పదాల్లోని జీవాక్షరాలతో 'రామ' అని శ్రీరాములవారికి పేరు పెట్టేట్ట. 'ప్రేమ అనేపదం 'ప్రేలాపన' 'సోమరి' అనే పదాలతాలూకు జీవాక్షరాలతో ఉద్భవించిందని నా నమ్మకం. ఈ ప్రేమగాథల్లో

నాయకు లున్నారు చూశారూ... ... ...ఏదీ... ...ఈ రోమియో, సలీమ్, మజ్ను. దేవదాసు మొదలయినవాళ్ళు... ... ...వీళ్ళల్లో ఏ ఒక్కడికీ ఒక్క పావలా డబ్బులు సొంతంగా సంపాదించే యోగ్యత లేదు. అమ్మా బాబూ తాలూకు రాజ్యాలూ, ఆస్తులూ వుండబట్టి పనీ పాటూ లేక ఈ ప్రేమే ఓ పెద్ద పనిగా పెట్టుకుని జీవితాలు తగల బెట్టుకున్నారు. అలాంటి చవటే ఈ చంద్రం కూడాను. చదువూ సంస్కారం సంఘంలో ఓ స్థానం వుంటే బుద్ధి యింత వెర్రితల లెయ్యదు. వీడు రాసిన ప్రేమ బోధిని చదివి వీడు కేవలం మూర్ఖుడు కాదనీ ఈ ప్రేమదెయ్యం పట్టడంవల్ల బుద్ధి వక్రించిందనీ మా అమ్మాయి గ్రహించి, ఎంతయినా మేనమామ కొడుకుకదా అని జాలిపడి 'బావ ఏదో దుష్ట సహవాసాలవల్ల పాడయిపోయి వుంటాడు. ఇంటికి తీసుకురా. పెళ్ళాడి బాగుచేస్తాను' అంది. మా అమ్మాయి అనుమానించినట్టుగానే కరటక దమనకుల్లాంటి స్నేహితులూ...'

"ఇప్పుడే వస్తానండి" అంటూ బయటపడి విశ్వం, పద్మనాభం తాలూకు నీడలు అంతర్ధానమైన దిక్కే కాళ్ళు మళ్ళించేను.